
# సహజచిత్రం



రాగిణి నిన్ననే వార్నింగ్ ఇచ్చేసింది. 'రేపు... గుర్తుంది కదా?' నిజానికి అది వార్నింగ్ కాదు, గుర్తు చేయటం. కానీ గుర్తుచేయటం దేనికి... నన్ను హెచ్చరించటానికి.

అయినా - రేపటి రోజును ఎలా మర్చిపోతాను? రేపటి రోజుకు నా జీవితంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది.

ఎన్నో ఏళ్ల క్రిందట... రేపటి రోజుకు నా జీవితంలో అనుకోని ప్రాముఖ్యం వచ్చేసింది. అంతటివరకు ఒంటరి జీవితాన్ని గడుపుతూ వచ్చిన నేను ఆ రోజు అనుకోకుండా రాగిణి కొంగున పడ్డాను. అవును. ఖచ్చితంగా అదే జరిగింది. ఆ పురోహితుడు చదివిన - పోనీ వల్లించిన ఆ మంత్రాలు ఏ భాషో కూడా నాకు తెలీదు. కానీ ఆ మంత్రాలతో బాటు ఆయన కొన్ని శుభకార్యాలు చేశాడు. ఆ మంత్రాలలో నిజంగా మహత్యం ఉందో లేదో నాకు తెలీదు. కానీ ఆయన చేసిన శుభ కార్యాలలో కొన్నింటికి మాత్రం మరీ మహత్యం ఉందని స్పష్టంగా నాకు రుజువు అయిపోయింది.

ఆయన - శ్రీ దీక్షితులు గారు మంత్రాలు వల్లిస్తూ రాగిణి కొంగుకు, నా పై పంచెకూ కొన్ని ముడులు వేశారు. నేను

వేసిన మూడు ముళ్ళకన్నా ఈ ముడులకే అధిక మహత్యం ఉందేమో! ఆ క్షణంలోనే రాగిణి కొంగుకు పూర్తిగా అంకితమయిపోయాను.

ఆ రోజు... రేపటిరోజు... ఎన్నో ఏళ్ళక్రితం... ఎన్నో అంటే... ఖచ్చితంగా మూడేళ్ళ క్రిందటే నా జీవితంలో జరిగిపోయిన రోజు - ఆ రోజుకు గుర్తుగా - నాకు రాగిణి వేసిన అందమైన సంకెళ్ల గుర్తుగా ప్రతి ఏడాది 'ఏదో' జరుపుకోవటం ప్రతి ఏటా జరుగుతున్న సంగతి.

రాగిణి గుర్తుచేసిన రోజు... ఆమె గుర్తు చేయకుండా ఉంటే బాగుండేది - కారణం మరేంలేదు. మూడేళ్ళ క్రితం పెళ్ళయింది, నిజమే! ఆ రోజున నాకు ఎంత చేతికి అందేదో ఈ రోజు అంతే అందుతోంది. ఎటొచ్చీ ఆనాడు చేతికి అందిన వస్తువులు ఏవీ ఈనాడు చేతికి అందటంలేదు. ప్రతి వస్తువు ఆకాశాన్ని అంటే ధరలలో ఊరిస్తూ ఉందే గానీ... అందటం లేదు.

కానీ - రాగిణి ఆడది. ఆమెకు కోరికలు ఉన్నాయి. ఉంటాయి. నాకు ఇది తెలీని విషయం కాదు. రాగిణికి తెలిసిన విషయం ఇంకోటి ఉంది - నాకూ ఎన్నో ఆశలున్నాయనీ, వీలున్నంత వరకూ రాగిణికి ఉన్న ఆశలు తీర్చాలని నాకు ఉంటుందనీ... కానీ మా ఇద్దరికి ఉన్న ఆశల సంగతి ఎటొచ్చీ నాకు ఉద్యోగం ఇచ్చిన ఆ మహాశయులకు తెలీటం లేదు.

మేం ఏం తక్కువ తిన్నామా! మా కోరికలను కాదనటానికి వాళ్ళకేం హక్కు. పిల్లల్ని ఎక్కువగా కనద్దు అనే అంటున్నారు కానీ, కలల్ని కనద్దని మహారాజశ్రీ ప్రభుత్వం వారు అనటంలేదు కదా! మేమూ ఆ పనిలోనే ఉన్నాం.. పిల్లల్ని ఇంకా కనలేదు. కలల్ని...? పెళ్ళయిన క్షణం నుంచీ అవే...

పెళ్ళిరోజున ఏం చేశామో ఈ రోజున సరిగ్గా చెప్పటం కష్టం. కానీ ఆ తర్వాత 'పెళ్ళిరోజు వార్షికోత్సవాల్లో' మాత్రం మా కార్యక్రమం వేరుగా ఉంటోంది.

మొదటి సంవత్సరం చేసిన పాపం, ప్రతి ఏడాదీ అలాగే చేయాల్సి వస్తోంది. అందుకే రాగిణి చేసిన హెచ్చరికా కూడానూ!

"గుర్తుంది" అన్నాను.

'గుర్తుంది' అని నిన్న అన్న సంగతి నాకు గుర్తుంది. కానీ జేబుకు మాత్రం చిల్లు లేకపోయినా పని అలాగే ఉంది. చిల్లుజేబు కాదు. ఖాళీ జేబు నన్ను వెక్కిరిస్తోంది.

కానీ - రాగిణి - మైడియర్ రాగిణి - ఆమెకు అన్యాయం తలపెట్టలేను. నా దగ్గర డబ్బులు లేవని తెలిసి కూడా రాగిణి పెళ్ళిరోజును గుర్తుచేసిందంటే - ఆమెకుండే ఆ చిన్న కోరిక... కాదనలేను, అనను.

రాగిణి ఆ రోజు ఏం చెయ్యాలనుకుంటుందో నాకు తెలుసు. ఆఫీసు మానేసి... పగలంతా రెస్టు తీసుకొని(?) సాయంత్రం బయలుదేరి ఓ సినిమా చూసి, తర్వాత ఇంటికొచ్చి - పక్క ఎక్కటం, అన్నీ మిడిల్‌క్లాస్ కోరికలే! ఈ కోరికల్లో ఏమీ కోరుకోకూడనివీ, కోరుకోతగనివీ లేవు. అందుకే రాగిణి కోరినట్టే చెయ్యాలంటే అప్పు చెయ్యటం తప్పనిసరి.

కానీ మనసొప్పదు. నిజానికి తల్చుకుంటే అన్నీ మానేసెయ్యవచ్చు. ఆఫీసుకు వెళ్ళకుండా ఉండటం మానచ్చు. సినిమాకు వెళ్ళకుండా ఉండొచ్చు. ఇంట్లోనే హాయిగా భోజనం చెయ్యొచ్చు.

కానీ అలా అంటే రాగిణి నన్ను చంపేస్తుంది. అందుకే అనలేదు. అప్పు చెయ్యటానికి సిద్ధపడ్డాను. ఎప్పుడూ చెయ్యిచాచి ఎరగని నేను ఆ రోజు అప్పుకోసం చెయ్యి చాచాను. రెండొందల రూపాయలు సంపాదించాను. రాగిణి మనసు సంతోషపడుతుంది. ఆమె సంతోషపడితే నేనూ సుఖపడతాను. ఇది అనుభవం మీద గ్రహించిన సంగతి.

సాయంత్రం అయింది.

పక్షులన్నీ గూటికి బయలుదేరే సమయంలో మేం.. జంట పక్షులం.. గూడునొదిలి బయటకు కదిలాం.

అసెంబ్లీ పక్కన చెట్లనీడల్లో నడుస్తూపోవటం నా కెంతో ఇష్టం. పబ్లిక్ గార్డెన్స్‌లోంచి అసెంబ్లీ చెట్లనీడల్లో నడుస్తూ టాకీసుకు చేరుకున్నాం. నేను పుట్టకమునుపు తండ్రి అయిన 'యువ హీరో' గారి సినిమా ఆడుతున్న టాకీసురానే వచ్చింది. హాలు ముందర ఆగిన కార్లను దాటుకొంటూ వెళ్ళాం - మామూలుగా వెళ్ళే క్లాసు కౌంటర్‌కేసి నడుస్తోంటే రాగిణి కళ్ళతోనే వారించింది.

అర్థమయింది. ఈ రోజు మా పెళ్లి వార్షికోత్సవం రోజు. మర్చిపోకూడని సంగతి అదే, మర్చిపోతున్నాను.

ఇష్టం లేకపోయినా మనసు పీక నొక్కేస్తూ టాకీసులో ఉన్న హైక్లాసు టికెట్ కొన్నాను. లోపలికి నడిచాను.

ఎయిర్‌కండిషన్డ్ అంటూ టిక్కెట్ల ధరలు ఆకాశానికి ఎత్తే ఈ యజమాన్యం ఎయిర్ ఎటూ కదలకుండా మంచి కండిషన్‌లో ఉంచింది. లోపల ఉండే జనం అంతా కుక్కిన పేనుల్లాగా - ఆ యజమాని ఏదో ఊరికే సినిమా చూపిస్తోంటే చూడ్డానికి వచ్చినట్టే ఉంది తప్ప, ఎవరూ ఇదేమిటని అడగరు.

నాకు ఇదంతా తెలుసు. అయినా ఈ రోజున అదంతా ఒక్కసారి అడిగి వస్తానంటే రాగిణి... 'ఊ, చాల్లెద్దురూ సోషల్ సర్వీస్ - ఇందరికీ తెలీని విషయమా ఇది, మీరెందుకు పట్టించుకొంటార'ంటూ, నన్ను కంట్రోల్ చేస్తుంది.

చెమట తుడుచుకొంటూ, మనసులో బాధ లోపలికే అణుచుకుంటూ కక్కుకొంటూ ఊరుకొన్నాను.

సినిమా పూర్తయ్యింది - హోటల్లో భోజనమూ పూర్తయ్యింది. హోటల్ బయట పాన్‌షాప్‌లో కిళ్ళీ కూడా నోట్లో పెట్టుకున్నాం. ఆటో కోసం అనుకొన్న డబ్బులు ఉండిపోయాయి - ఖర్చు పెట్టలేక కాదు, ఆటోవాళ్ళ సమ్మె పుణ్యమా అని సురక్షితంగా నా జేబులోనే మిగిలిపోయాయి.

పని చేస్తున్న రోజుల్లో ఏ రోజూ చేయని సేవ, వాళ్ళు సమ్మె చేస్తూ ఇప్పుడు చేయటం గొప్ప విషయం. వాళ్ళలా సమ్మెలోనే ఉండిపోతే ఎంత అదృష్టమో అనిపించింది నాకు.

తప్పనిసరి కాబట్టి బస్‌స్టాండ్‌లో నిలబడ్డాం. నడిచేదూరం అయితే నడిచి వెళ్ళిపోయేవాళ్ళం. ఈ రోజు హాయిగా నవ్వుకొంటూ, కబుర్లు చెప్పుకొంటూ, నడిచి వెళ్ళిపోయే వాళ్ళమే కానీ నడిచేదూరం కాకపోయే మరి!

ఒక్కో బస్సూ అలా కనిపించి ఇలా తుర్రుమంటోంది. అలవాటు పడ్డ ప్రాణులం. బస్సు వస్తోంటే ఆశగా ఒక్క అడుగు ముందుకు వేసి, ఆ బస్సు నిలబడకుండా వెళ్ళిపోవటంతో రెండడుగులు వెనక్కు వేస్తూనే ఉన్నాం. నిజానికి మాలాటి జంటలు ఇంకో పదిమంది వరకూ ఉన్నారు. తోడుగా ఇంకో పాతిక మంది ఒంటరి జనం. బస్సుస్టాండ్ అంతా కళకళలాడుతోంది.

రాత్రి పదవుతున్నా బస్‌స్టాండ్‌లో ఎంతటి ఓపికతో జనం నిలబడుతున్నారో చూస్తోంటే ప్రభుత్వం వారికి కూడా మతిపోతుంది. 'ఆ, వీళ్ళు ఇంటికి వెళ్ళి మాత్రం చేసేదేముంది' అనుకొంటూ ప్రభుత్వం కూడా ఆ జనాన్ని చూస్తూ ఆశ్చర్యంతో నిలబడిపోతుంది! అయినా బస్సులు మాత్రం నిలబడకుండా వెళ్ళిపోతుంటాయి.

అంతలో నా ముందొక బస్సు - ఆర్టీసీ బస్సే నిలిచింది. ఆశ్చర్యం! ఆగింది అంటే ఆశ్చర్యం కాదూ!

రాగిణికి కనుసైగ చేశాను - ఎలాగైనా ఈ బస్సు ఎక్కక తప్పదు సుమా అంటూ. రాగిణి నా సహధర్మచారిణి - చెప్పగానే అర్థం చేసుకొంటుంది.

పైటకొంగు బిగగట్టి వీర ఝాన్సీ కీ రాణీలా రణరంగంలోకి దిగింది - నేను ఇట్నుంచి సహగమనం చేశాను యుద్ధరంగంలోకి.

పైకి ఎక్కేవాణ్ని ఎక్కనీయకుండా, కిందకులాగే జనం అధికారం విషయంలోనే కాదు, ఆఖరికి బస్సుల్లో కూడా ఉంటారనేది అర్థం అవుతోంది నాకు. ఎవరో నా జేబును తనది అనుకొన్నాడు కాబోలు, హాయిగా ఏ చీకూ చింతా లేక, ఏమాత్రం మొహమాటపడక తడుముతున్నాడు. అయినా జేబు నాది అని గుర్తుచేయటానికి చెయ్యి అటు వేశాను. 'ఆ పెద్ద మనిషి' చెయ్యి నా జేబులోంచి, నా చేతిలోంచి సన్నగా జారుకొంది - ఎవరి తాపత్రయం వారిది!!

ఇద్దరం ఒకటే బస్సులో ఉన్నాం.

నడుస్తున్న బస్సు నడుస్తూ, నడుస్తూ ఉన్నట్టుండి ఆగిపోయింది, ఏదో పెద్ద కలకలం. ముందువైపు ఆడవాళ్ళల్లో ఏదో పెద్దగోల.

అందరికి ప్రశ్నలే! ఏం జరిగింది అంటే ఏం జరిగింది అంటూ అడిగేవారే ప్రతివారూనూ! నాకు కుతూహలంగానే ఉంది కానీ అడగలేదు - ఎవర్ని అడిగినా ఏం చెబుతారు! - పక్కవాడికి ఇన్‌ఫర్‌మేషన్ వస్తే నాకూ వస్తుంది. అనుకొన్నట్లుగానే కారణం తెలిసింది. ఎవరో ఆడవాళ్ళ మెడలో గొలుసు తెంపేస్తోంటే... ఇంతవరకూ ఆశ్చర్యం లేదు. ఇపుడే కదా నా జేబును ఎవరో తడిమింది! - ఆశ్చర్యమంతా - దొరికిపోయారట!!

... బాధపడ్డాను. దొరికిపోయిన ఆడదొంగ ఏ ఇబ్బందికి గురవుతుందో ననిపించింది.

దొంగతనం చేస్తూ దొరికిన మగాణ్ని చితకబాదుతారు.

కానీ... ఆడదాన్నో...? తెలీదు.

... ఈ రోజు తెలుస్తుంది నాకు అదికూడానూ!

"ఆరు కాసుల బంగారపు గొలుసుట!"

"పూర్తి గొలుసుకాదు, గుళ్ళతో ఉన్న గొలుసు!"

"గుళ్ళ బంగారపు గొలుసంటే – ఎప్పటిదో అయి ఉండాలి!"

"అయినా దొరికింది కదా! అదృష్టవంతురాలు!!" – ఎన్నో రకాల వ్యాఖ్యలు.

ఎవరో ఆ అదృష్టవంతురాలు అనుకొన్నాను. చూడాలని ప్రయత్నించినా వీలుపడటం లేదు. అటు ఆమెకేసి చూసేలోపున, ఇట్నుంచి నాకేసి ఎవరైనా చూసేస్తే... ఆ ప్రయత్నం విరమించుకొన్నాను.

దొంగిలించిన స్త్రీ ఎవరో తెలిసిపోయింది. ఆమెను తన్నాలనీ, కొట్టాలనీ, ఇలాంటి వాళ్ళ చేతులు నరికెయ్యాలనీ, వాళ్ళను పోలీసుల చేతిలో పెడితే అదే పెద్ద శిక్ష అవుతుందనీ... రకరకాల సలహాలు – అన్నీ ఉచితమే.

కానీ, ఏం జరిగిందో బస్సు రణగొణ ధ్వనిలో తెలీటం లేదు – మొత్తానికి ఆమెను దించేశారు. బస్సు కదిలింది.

నా ఆలోచనలూ మళ్ళీ మొదలయినాయి –– ఎవరో నిజంగానే అదృష్టవంతురాలు! పోవాల్సిన ఆరుకాసుల బంగారపు గొలుసు నిలబడిపోయిదంటే, అది నిజంగా కష్టార్జితం అయి ఉండాలి!! కష్టార్జితానికి ఇంకా దేవుడి దయ ఉంటోందన్నమాట!

మా బస్‌స్టాపు వచ్చింది. ఇట్నుంచి నేను దిగాను. రాగిణి కోసం అటువైపు వెళ్ళాను. "అదృష్టమంటే నీదేనమ్మా––" అంటూ ఒకరూ, "జాగ్రత్త తల్లీ!" అంటూ ఇంకొకరు, "ఇంకెప్పుడూ ఇంత ఖరీదయినవి పెట్టుకొని రావద్దు" అంటూ మరొకరు రాగిణికి సలహాలనిస్తూ వీడ్కోలు చెబుతున్నారు. నాకు మతిపోయింది. అంటే...

గొలుసు కట్ అయింది రాగిణి మెడలోనా!

మై గాడ్!

బస్సులోంచి రాగిణి దిగింది – బస్సు కదిలి వెళ్ళిపోయింది.

రెండడుగులు వేశాక అడిగాను రాగిణిని – "నీదా గొలుసు కట్ అయింది?" అంటూ.

ఔనంటూ రాగిణి తన అరచేతిని విప్పింది, రోడ్డుపక్క దీపం వెలుగులో ఆమె చేతిలో గుళ్ళూ గొలుసు తళుక్కున మెరిశాయి.

"అంత గొడవెందుకు చేశావ్! పోతే పోయేది రోల్డ్‌గోల్డుదే కదా! నీదని తెలీదు నాకు, లేకపోతే..."

"అందుకే మీకు తెలినివ్వలేదు. నేను – అందరూ బంగారందే అనుకొని అయ్యో అంటోంటే 'కాదండి ఇది రోల్డ్‌గోల్డ్‌దేనని, చిలకలూరిపేట బంగారమేనని ఎలా చెప్పుకోను?' అందుకోసమే ఊరుకొన్నాను..." అంది రాగిణి...

నాకు ఆశ్చర్యం వేసింది – ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా చెప్పటానికి రాగిణి ఎందుకు ఇష్టపడలేదు?

ఆలోచిస్తోంటే కారణం తెలుస్తోంది. చేసుకోకపోయినా పర్వాలేని పెళ్ళిరోజు 'వార్షికోత్సవాన్ని' మేం అప్పుచేసి మరీ జరుపుకొన్నాం. మామూలుగా వెళ్ళే క్లాసుకన్నా ఇంకా ఎక్కువ క్లాసులో కూర్చుని అదే చెత్త సినిమా చూశాం. ఇంట్లో ఒకటి రెండు అయిటమ్సుతో తినే మేం ఆరురకాల రుచులనూ చవిచూశాం.. వీటన్నింటికి వెనుక ఏం కారణం ఉందో, రాగిణి నోరు మూసుకొని ప్రజల సానుభూతి సంపాదించటానికి అదే కారణం ఉంది!

... నాకు ఈ కారణం తెలీక కలిగిన ఆశ్చర్యం, కారణం తెలియగానే మాయమయింది.

... వెన్నెల నిండుగాకాస్తోంటే మేం ఇద్దరం మాత్రం మౌనంగా వీధిలైట్ల వెలుగులోనే నడుస్తున్నాం!!

– *ఈనాడు తెలుగునాడు పక్షపత్రిక, 16-31 మే,1979*